మూకని వెనకేసుకుని అల్లరి- ఇదే ధ్యాస తప్పించి చదువు లేదు. మిగతా మేష్టర్లంతా విసుగుపుట్టి అతని కర్మానికి అతన్ని వొదిలి ఊరుకున్నారు. ఆయనమాత్రం ఒక విద్యార్థి అలా పాడవడం చూస్తూ ఊరుకోలేక కామేశాన్ని సంస్కరించ పూనుకున్నారు కొన్నాళ్ళు. "చూడు కామేశం, సూర్యాన్ని చూసి నేర్చుకో, బాగుపడే లక్షణాలు అవి, మీ నాన్నగారి పేరుప్రతిష్ఠలు చూడు, ఆయనపేరు చెడకుండా వుండాలనైనా కొంచెం చదువు. రోజుకో డ్రస్, నిగనిగలాడే బూట్లు కట్టుకుని స్టైలుగా తయారవడమేగాని, పొట్ట చించినా అక్షరం ముక్క లేదు. నీలాంటివాడు నా క్లాసులో వుండడం నాకే సిగ్గుచేటు, అవమానం!" ఇలా అనేకవిధాల అతన్ని మంచిగా ఒకప్పుడు రెచ్చగొట్టి పౌరుషం తెప్పించి మరొకప్పుడు, ప్రయత్నించారాయన. కాని, ఫలితం శూన్యం. "ఆ సూర్యంగాడికి నాకూ పోలికా! వాడొక పుస్తకాల పురుగు. నాకలా ఇరవై నాలుగు గంటలూ బుర్ర పుస్తకాల్లోదూర్చి కూర్చోడం చేతకాదు. వాడికంటే గతిలేదు కాబట్టి చచ్చినట్లు రుబ్బుతాడు. నాకా అవసరం లేదు. వాడిలా చదివితే వాడికంటే బాగానే వస్తాయి మార్కులు!" "స్కూలుకి కుళ్ళు బట్టలు, కంపు బట్టలు వేసుకు రావాలి గాబోలు. ఆ సూర్యం గాడిలాగ! కుళ్ళు బట్టలు కట్టుకుంటే చదువొచ్చినట్లే గాబోలు! కాస్త బాగుంటే చూడలేక ఏడుస్తారు కుళ్ళు వెధవలు" అలా నోటికొచ్చినట్లు మేష్టారికి వినిపించేట్లు పరుష వాక్యాలు మాట్లాడేవాడు కామేశం. ఇక ఆ

మీద ఆ దూకుడంతటికీ కారణం సూర్యంలో లోపమేనేమో, ఆఫీసరుగా తనబాధ్యత అతను నెరవేరుస్తున్నాడేమో, కామేశాన్ని అనుమానించడం సరిగాదేమో అనిపించేది మరుక్షణం.

ఏమైనా చిన్ననాటి సహవాసం గదా, అంత మరీ కఠినంగా మందలించకుండా, చనువుగా, అభిమానంగా చెప్పకూడదా అనిపించేది. ఇంతకీ తనిక్కడికి రాకపోయుంటే, కామేశం ఇంట్లో మకాం పెట్టకుండా వుంటే, సూర్యం అనుభవిస్తున్న పాట్లు చూడక్కరలేకపోయేదేమో! సూర్యం గురించిన బెంగ ఆయనలో రోజురోజుకీ యెక్కువ కాసాగింది!

"నమస్కారం మేష్టారు!" బీచిలో వంటరిగా పరధ్యానంగా కూర్చున్న అవధానిగారు సూర్యం పలకరింపు విని సంతోషంతో పొంగిపోయారు.

"రా, రా, సూర్యం! యిలా వంటరిగా కలుసుకు మాట్లాడాలనీఎన్నాళ్ళనించోఅనుకుంటున్నాను!వీలే కుదరడం లేదు కూర్చో!" ఆప్యాయంగా చెయ్యిపట్టుకుని ప్రక్కన కూర్చోపెట్టుకున్నారు.

"ఏమిటి సూర్యం! యిలా అయిపోయావు? నువ్వెంతో పైకి వెళ్తావనుకునేవాడిని. యిలా కామేశం క్రింద గుమస్తాగా చూస్తానని ఎన్నడూ అనుకోలేదు." బాధనంతనీ వెళ్ళగ్రక్కారు అవధానిగారు.

"ఏమిటి మేష్టారు, మనం అనుకున్నవి అనుకున్నట్లుగా జరిగితే ఈ ప్రపంచం ఇలా ఎందుకుంటుంది? నోట్లోఅక్షరం

ముక్కలేని కామేశం కలక్టరవగాలేనిది, నేను గుమస్తానవ డంలో ఆశ్చర్యమేముంది ?" జీవం లేని నవ్వు నవ్వాడు సూర్యం.

"అదే నన్ను బాధిస్తున్నది! ఇంతకీ నువ్వు చదు వెందుకు మానావు ?"

"ఏం చెయ్యడం మాష్టారూ ? మా ఇంటి సంగతి మీకు తెలుసుగదా! మానాన్నగారి జీతంమీదనే ఆధారం. అలాగే పదిరోజులు నెట్టుకొచ్చేవాళ్ళం. నాన్నగారు ఎన్ని కష్టాలు పడయినా నన్ను పెద్ద చదువులు చదివించి, పెద్ద ఉద్యోగస్తుని చెయ్యాలని ఆరాటపడేవారు. బ్రతికివుంటే సాధించేవారేమో! నా దురదృష్టం కొద్ది నేను ఇంటర్ రెండో సంవత్సరం చదువుతుండగానే గుండెపోటు వచ్చి, సంసారభారం నా మీద మోపి వెళ్ళిపోయారు. ఇద్దరు చెల్లెళ్లు, తమ్ముడు, తల్లి, విధవక్కగారు ఇంతమందిని పోషిం చాలి. ఏం చెయ్యను ? చదువుదామని అభిలాష వున్నా రోజులు గడిచేదెలాగా ? ఇంటర్ పాస్ కాగానే అతికష్టం మీద, అతిప్రయాసతో ఈ ఉద్యోగం సంపాదించుకున్నాను. ఇంటిలో ఒక భాగం అద్దెకిచ్చి ఆ డబ్బుతో, నా జీతంతో, మా అక్కయ్య చుట్టుప్రక్కల చిన్నపిల్లలకి ట్యూషన్ చెప్పి సంపాదించే ఆ కొద్దిపాటి డబ్బుతో ఎలాగో రోజులు వెళ్ళదీస్తున్నాను. ఇప్పుడు చదువుకుంటున్న తమ్ముడు, పెళ్ళి కావల్సిన చెల్లెలేగాక, నా భార్య, ఒక అబ్బాయి, రేపో మాపో ఇంకో పసికందు... ఇదీ నా సంసార పరిస్థితి మేష్టారూ ! ఏం చెయ్యమంటారు ? ఒక్క తెలివి తేటలుంటే

"చూడు నాయనా, పేదవాడికోపం పెదవికి చేట న్నారు! ఆ సంగతి అతనికి బాగా తెలుసు. ఏమనగలడు? అందులోనూ నీమీద! నేనేభరించలేక పోతున్నాను, అతని స్థితిచూసి! అతను నా ప్రియ శిష్యుడని నువ్వే అంటున్నావు? అందరికీ తెలుసు ఆ సంగతి. అందుకే, ఈ రాత్రి బండికి నేను వెళ్ళిపోదామనుకుంటున్నాను"

కామేశం మొహం వివర్ణమయింది. కొద్దిక్షణాలువుండి అదోలాగ నవ్వాడు.

"అయితే సూర్యం కోసం, మీరు బాధపడ్డానికే నిశ్చయించుకున్నారన్నమాట!"

"చూడు కామేశం! నువ్వు పెద్దఅధికారివి. అందరూ నిన్ను ఆకాశానికి ఎత్తుతారు. కాని, నీ సంబంధం వేరు. ఆ చనువు పురస్కరించుకుని రెండు మాటలు చెప్పి వెళ్ళిపోతాను. అధికారం, ధనం ఇవాళ వుండి రేపుపోవచ్చు. కాని మమత, అభిమానం అలా క్షణికాలు కావు. అందుకే సూర్యం కష్టాల్ని నేను చూడలేక పోతున్నాను. అందులోనూ, వాటికి నేను కారణం గావడం అసలు సహించలేను! అన్నిటా అదృష్ట దేవత నిన్ను వరించింది. ఏదీ దక్కని నిర్భాగ్యుడు సూర్యం! అతన్ని చూసి జాలి పడడం మినహా ఏం చేయలేని అసమర్థుడిని! ఏ కారణంతో చేసినా ఈ రెండు నెలలు నన్ను ఆదరించావు. అందుకు నీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియదు. గురువుగా నన్ను

